TGTEL/26/
వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక

వర్షా కాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యంగా

# అధికారులు పని చేయాలి







హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 41 | 23-06-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల: 3/-

# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

**యువతకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు..**

**మహబూబ్‌నగర్‌లో రూ. 12.53 కోట్లతో క్రీడా పనులకు శంకుస్థాపన**

**పాలమూరు క్రీడాభివృద్ధికి వంద కోట్లయినా ఖర్చు చేస్తామన్న మంత్రి**

**క్రీడల బడ్జెట్‌ను రూ. 640 కోట్లకు పెంచిన సీఎం రేవంత్ రెడ్డి**

**350 మంది కొత్త కోచ్‌ల నియామకం.. సీఎం కప్‌తో ప్రతిభకు గుర్తింపు**



హైదరాబాద్, (డిడి9 వార్త):

"యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. స్మార్ట్‌ఫోన్లు, వ్యసనాల మత్తును వదిలి మైదానాల్లోకి అడుగుపెట్టాలి" అని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో

మిగతా 2లో..

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష**

**తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్**

**జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు**

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా

మిగతా 2లో..






# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

**షూటింగ్ సాకుతో పిటిషన్..**

**విచారణ జూలై 6కు వాయిదా**

**సంధ్య థియేటర్ కేసు విచారణ**

**ఇతర 18మంది నిందితుల హాజరు..**

**బాండ్లపై సంతకాలు**



హైదరాబాద్, (డిడి9 వార్త):

టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు, 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టు విచారణకు హాజరుకాలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ఆయన ఈరోజు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఈ మేరకు గతంలోనే న్యాయస్థానం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నందున భౌతికంగా హాజరుకావడం సాధ్యం కాదంటూ అల్లు అర్జున్ తన న్యాయవాది ద్వారా కోర్టుకు సమాచారం అందించారు. వ్యక్తిగత హాజరు

మిగతా 2లో..

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

**ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**

**సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి**




# ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

**కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటు కౌంటర్**

**ప్రజా పాలనను సినిమాలతో పోల్చడం సరికాదు**

**బీఆర్ఎస్ పార్టీ అబద్ధాల పుట్టగా మారింది**

**కేటీఆర్ అజెండా ప్రకారం పాలన సాగదు**

**మాది పేదలు, రైతుల పక్షపాతి ప్రభుత్వం**

**రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే**

**నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచన**



హైదరాబాద్, (డిడి9 వార్త):

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై గులాబీ పార్టీ (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేసిన విమర్శలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పాలనను "సగం సినిమా అట్టర్ ఫ్లాప్ అయింది, మిగిలిన సగం మాత్రమే ఉంది" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని మంత్రి సీతక్క రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ప్రజల కోసం సాగుతున్న ప్రజా పాలనను సినిమాతో పోల్చడం కేటీఆర్ అపరిపక్వ ఆలోచనా విధానానికి, అహంకారానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు. రాత్రింబవళ్లు ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం కష్టపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సినిమాల కోణంలో చూడటం కేటీఆర్ దిగజారుడు రాజకీయ సంస్కృతికి నిదర్శనమని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రభుత్వం అంటే ఏదో మూడు గంటల సినిమా కాదని, కోట్ల మంది ప్రజల జీవితాలతో

మిగతా 2లో..

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**మొదటిపేజీ తరువాయి**

సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించే నిర్ణయాన్ని స్వాగతించిన జేఏసీ....

**మెదక్ జూన్ 22 (డిడి9 వార్త)**



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయడాన్ని జేఏసీ కోచైర్మన్, టీజీడిసిఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎం. వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కూడా ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, దాదాపు పదేళ్ల పాటు ఆ హామీని అమలు చేయకుండా ఉద్యోగులను నిరాశకు గురి చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని డా. ఎం. వినోద్ కుమార్ అన్నారు. ఇకపై ఉత్తర్వులను అన్ని శాఖల్లో కచ్చితంగా అమలు చేసి, ప్రతి నెల మొదటి తేదీన ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

**మొదటిపేజీ తరువాయి**



నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంపై నమోదైన కేసులో తీవ్రత దృష్ట్యా ఈ నెల 22న అల్లు అర్జున్ ఖచ్చితంగా కోర్టుకు రావాలని నాంపల్లి న్యాయస్థానం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే, కోర్టు గడువు ముగిసే సమయానికి కూడా నటుడు అక్కడ ప్రత్యక్షం కాలేదు. షూటింగ్ బిజీ షెడ్యూల్ కారణంగానే ఆయన రాలేకపోయారని తెలుస్తోంది. కోర్టుకు రాకపోవడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది.

ఈ కేసుకు సంబంధించి కోర్టు మొత్తం 19 మంది నిందితులకు సమన్లు జారీ చేసింది. జూన్ 22న అందరూ న్యాయమూర్తి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. అల్లు అర్జున్ మినహా మిగిలిన 18 మంది నిందితులు సోమవారం ఉదయమే నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. వీరంతా న్యాయమూర్తి సమక్షంలో విచారణకు హాజరై, తమకు కేటాయించిన వ్యక్తిగత షూరిటీ బాండ్లపై సంతకాలు పూర్తి చేశారు.

ప్రస్తుతం అల్లు అర్జున్ బాలీవుడ్ పరిధిలోని ముంబై నగరంలో ఒక ముఖ్యమైన సినిమా షూటింగ్‌లో ఉన్నట్లు ఆయన లీగల్ టీమ్ ప్రకటించింది. ముంబై షెడ్యూల్ ఎంతో కీలకమైనది కావడం వల్లే ఆయన హైదరాబాద్ వచ్చి విచారణకు భౌతికంగా హాజరుకాలేకపోతున్నారని జాతీయ వార్తా సంస్థ 'ఏఎన్ఐ' ప్రతినిధులకు ఆయన న్యాయవాదులు ముందుగా తెలియజేశారు.

కోర్టుకు స్వయంగా రాలేని పక్షంలో.. అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్ పద్ధతి) ద్వారా నాంపల్లి కోర్టు విచారణలో పాల్గొంటారని మొదట ఆయన లీగల్ టీమ్ ప్రచారం చేసింది. ముంబై షూటింగ్ స్పాట్ నుంచే ఆయన ఆన్‌లైన్ ద్వారా హాజరవుతారని భావించారు. అయితే, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఆయన వర్చువల్‌గా కూడా విచారణకు హాజరుకాలేదు. దీంతో చేసేదేం లేక అల్లు అర్జున్ తరపు న్యాయవాది కోర్టులో అధికారికంగా 'ఆబ్సెంట్ పిటిషన్' దాఖలు చేయాల్సి వచ్చింది.

నిందితుడి స్థానంలో ఉన్న అల్లు అర్జున్ అటు భౌతికంగా, ఇటు వర్చువల్‌గా కూడా కోర్టు విచారణకు రాకపోవడంపై న్యాయస్థానం స్పందించింది. ఆయన వ్యక్తిగతంగా హాజరుకానందున, అందుకు గల సరైన కారణాలను వివరిస్తూ తక్షణమే ఒక సమగ్రమైన 'మెమో' దాఖలు చేయాలని అల్లు అర్జున్ న్యాయవాదులకు కోర్టు గట్టిగా సూచించింది. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది.

రెండు వైపులా వాదనలు విన్న అనంతరం నాంపల్లి న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల జూలై 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వచ్చే విచారణ సమయానికైనా అల్లు అర్జున్ అందుబాటులోకి వస్తారా అన్న ప్రశ్నకు ఆయన లాయర్ సమాధానమిచ్చారు. జూలై 6న జరిగే తదుపరి విచారణకు అల్లు అర్జున్ ఖచ్చితంగా వర్చువల్ పద్ధతిలో న్యాయస్థానం ముందు హాజరవుతారని న్యాయమూర్తికి హామీ ఇచ్చారు.

అసలు ఈ వివాదం 2024 డిసెంబర్ నెలలో ప్రారంభమైంది. అప్పట్లో మోస్ట్ అవేటెడ్ మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా ఘనంగా విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ ఆవరణలో భారీ ప్రీమియర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హీరో అల్లు అర్జున్ వస్తున్నారనే సమాచారంతో వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా థియేటర్ ముట్టడించారు. ఈ క్రమంలో జరిగిన ఘోర తొక్కిసలాటలో రేవతి అనే ఒక వివాహిత ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీ తేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు అభిమానులు కూడా క్షతగాత్రులయ్యారు.

ఈ ప్రమాదంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సంధ్య థియేటర్ యాజమాన్యం మరియు నిర్వాహకులను ఏ1 నుంచి ఏ10 నిందితులుగా చేర్చారు. తొక్కిసలాట జరగడానికి నటుడి రాక, భద్రతా లోపాలే కారణమంటూ అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఏ11 నిందితుడిగా పోలీసులు చేర్చడం అప్పట్లో టాలీవుడ్‌లో పెను సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గతంలో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా, ఆయన ఒక రాత్రి మొత్తం జైలు గదిలో గడపాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ఉదయమే ఆయనకు కోర్టు నుంచి బెయిల్ లభించింది.

# వర్షా కాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యంగా అధికారులు పని చేయాలి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది వరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

అత్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీవాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ, తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని... పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

**204 మీ.మీ వర్షం నమోదైతే రెడ్ అలెర్ట్..**

24 గంటల్లో 64.5 మి.మీ కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్ కింద సాధారణ పర్యవేక్షణ కొనసాగిస్తూ యంత్రాలు, సామగ్రి సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని మంత్రి సూచించారు. 64.5 నుంచి 115 మి.మీ మధ్య వర్షపాతం నమోదయ్యే యెల్లో అలర్ట్ పరిస్థితుల్లో సున్నితమైన ప్రాంతాలను సహాయ కార్య నిర్వాహక ఇంజినీర్లు (ఏఈఈలు) ప్రత్యక్షంగా సందర్శించి, కాంట్రాక్టర్లు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. 115 నుంచి 204 మి.మీ మధ్య వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఏఈఈలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా... ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. 204 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదయ్యే రెడ్ అలర్ట్ పరిస్థితుల్లో ఏఈలు, ఏఈఈలు, ఈఈలు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాలని, పరిస్థితులపై వెంటనే ఎస్ఈ, ఆపై సీఈలకు సమాచారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు.



# ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

**మొదటిపేజీ తరువాయి**

ముడిపడి ఉన్న బాధ్యత అని గుర్తు చేశారు. కల్పిత కథలతో నడిచే సినిమాలకు, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వానికి ఉన్న తేడాను కేటీఆర్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇటువంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

గడిచిన కొన్ని నెలలుగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అబద్ధాల పుట్టగా మారిపోయిందని మంత్రి సీతక్క ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి మంచి సూచనలు చేయాల్సిన ప్రధాన ప్రతిపక్షం.. ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేవలం నిరంతర విమర్శలు చేయడం, సోషల్ మీడియా వేదికగా రాజకీయ డ్రామాలకు తెరతీయడానికే పరిమితం అవుతోందని ధ్వజమెత్తారు. వాస్తవాలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించడమే ధ్యేయంగా గులాబీ నేతలు పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతుకను వినిపించాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదే అయినప్పటికీ, తెలంగాణలో ఆ పరిస్థితి లేదని సీతక్క వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ఫలాలను చూసి ఓర్వలేక, ఏదో ఒక రకంగా గందరగోళం సృష్టించాలని చూస్తున్నారన్నారు. నిజమైన సమస్యలను ప్రస్తావించి, వాటికి పరిష్కార మార్గాలు సూచిస్తే ప్రభుత్వం ఖచ్చితంగా స్వీకరిస్తుందని, కానీ బీఆర్ఎస్ నేతలు కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే అసత్య ప్రచారాలు ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు.

"కేటీఆర్ అనుకున్న ఆలోచనలు, వారి పార్టీ అజెండాలు మా ప్రభుత్వంలో అమలు కాకపోతే.. మా పాలన విఫలమైనట్లా?" అని మంత్రి సీతక్క నిలదీశారు. తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఇది కేవలం ప్రజల అవసరాలు, రాష్ట్ర ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఎవరిదో వ్యక్తిగత లేదా ఒక కుటుంబ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రభుత్వం నడవదని తేల్చి చెప్పారు. అబద్ధాలను పదే పదే ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు దిట్టలుగా మారారని విమర్శించారు.

ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పేదలు, రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. దేశంలోనే రైతు సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధి విషయాల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రత్యేకమైన చరిత్ర, విశ్వసనీయత ఉన్నాయని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు పడిన కష్టాలను తీరుస్తూ, వారి ముఖాల్లో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

భారతదేశంలోనే రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు భారీ ఎత్తున రుణమాఫీ చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సీతక్క అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి (వైఎస్సార్) ప్రభుత్వంలో ఏకకాలంలో రైతు రుణమాఫీని విజయవంతంగా అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. అదే రీతిలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీని పక్కాగా అమలు చేసి అన్నదాతలకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చడానికి మరియు బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు చేపడుతోందని సీతక్క వెల్లడించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ మరియు గిట్టుబాటు ధర ఉన్న పంటలను సాగు చేసేలా రైతులను శాస్త్రీయంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల రైతులకు దళారీల భయం లేకుండా మంచి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను మార్చడమే తమ లక్ష్యమన్నారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకుని, ప్రజల సమస్యలపై నిజాయితీతో కూడిన నివేదికలతో రాణించాలని, సమాజానికి ఉపయోగపడేలా ఒక నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సీతక్క సూచించారు. నిరంతరం విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే మంచి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ప్రతి విమర్శను ప్రజలు గమనిస్తున్నారని, తాము చేపడుతున్న సంక్షేమ, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలే తమ ప్రభుత్వ తిరుగులేని పనితీరుకు నిదర్శనమని సీతక్క స్పష్టం చేశారు.

# మల్కాపూర్ లో ఫ్రీ ప్రైమరి స్కూల్ లో అక్షరాభ్యాసం...

**తూప్రాన్ జూన్ 22 డిడి9 వార్త**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఫ్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ సత్యనారాయణ తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించేందుకు ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు వినూత్న రీతిలో రాష్ట్ర సర్కార్ విద్య బోధనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని సర్పంచ్ కొనియాడారు. మల్కాపూర్ కు మంజూరైన ఫ్రీప్రైమరీ స్కూలు సౌకర్యాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. పాఠశాల తరగతి గది పెయింటింగ్, చిత్రలేఖనం, ఆట వస్తువుల కై ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎంఈఓ తెలిపారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్రావు, యాదగిరి, ఉప సర్పంచ్ స్వామి, ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, వార్డు సభ్యులు రేఖ, మేక్ ఇన్ యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రూ. 12.53 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం భారీ నిధులను కేటాయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ రూ. 12.53 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూ. 10.70 కోట్లతో 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మించనున్నారు. దీనితో పాటు రూ. 1 కోటి వ్యయంతో నాలుగు ఓపెన్ జిమ్‌లు, రూ. 51 లక్షలతో ఇండోర్ జిమ్ మరియు మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. మిగిలిన రూ. 32 లక్షలను ఇతర అనుబంధ క్రీడా వసతుల కోసం ఖర్చు చేయనున్నట్లు మంత్రి వివరించారు.

క్రీడలు అనేవి కేవలం టైమ్‌పాస్ వినోదం మాత్రమే కాదని, మనిషి జీవనశైలిని, క్రమశిక్షణను మార్చే ఒక శక్తివంతమైన సాధనమని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో క్రీడా మౌలిక సదుపాయాల కోసం ఇప్పటికే ప్రభుత్వం సుమారు రూ. 80 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం అవసరమైతే పాలమూరు జిల్లాలో క్రీడల కోసం రూ. 100 కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం వెనుకడబోదని మంత్రి స్పష్టం చేశారు.

క్రీడా రంగ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం 'గ్రీన్ ఛానల్' పద్ధతిని తీసుకువచ్చిందని, దీని ద్వారా నిధుల విడుదల, సాంకేతిక అనుమతులు త్వరితగతిన లభిస్తాయని మంత్రి వెల్లడించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను ఇకపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్లబ్‌లు, క్రీడా అసోసియేషన్లు కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో దాగి ఉన్న అసలైన ప్రతిభను వెలికితీయడానికి చురుగ్గా పని చేయాలని సూచించారు.

ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకంతో మహబూబ్‌నగర్ జిల్లాకే నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. జిల్లాలో త్వరలోనే వాలీబాల్, కబడ్డీ అకాడమీలతో పాటు అత్యాధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడల్లో మన దేశం తరపున పాలమూరు బిడ్డలు ప్రాతినిధ్యం వహించి దేశానికి బంగారు పతకం సాధించేలా అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తామని, అవసరమైతే ఇందుకోసం మరిన్ని భూములను సేకరిస్తామని స్పష్టం చేశారు. మొదట ఈ బడ్జెట్‌ను రూ. 350 కోట్లకు, ఆ తర్వాత రూ. 640 కోట్లకు పెంచినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడా పాఠశాల (స్పోర్ట్స్ స్కూల్) ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనికోసం ఇప్పటికే 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సిద్ధంగా ఉంచినట్లు జితేందర్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 2014 నుంచి 2024 వరకు గత పదేళ్ల కాలంలో క్రీడలకు కేటాయించిన బడ్జెట్ ఎప్పుడూ రూ. 300 కోట్లు దాటలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రూ. 360 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ. 468 కోట్లు, తాజా మూడో బడ్జెట్‌లో ఏకంగా రూ. 640 కోట్లు కేటాయించి క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలోని నిర్లక్ష్యానికి గురైన స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్‌ను పునరుద్ధరిస్తున్నామని, ఉమ్మడి పాలమూరులోని ప్రతి జిల్లాకు రూ. 15 నుండి రూ. 18 కోట్ల వరకు క్రీడా అభివృద్ధి కోసం ఇస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో 2009 తర్వాత క్రీడా కోచ్‌ల నియామకాలే జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులకు నిపుణులైన శిక్షకులను అందుబాటులోకి తెచ్చేందుకు దాదాపు 350 మంది కొత్త కోచ్‌ల నియామక ప్రక్రియను చేపట్టిందని శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'సీఎం కప్' పోటీలను నిర్వహిస్తున్నామని, మొదటి విడతలో 3.5 లక్షల మంది, రెండో విడతలో 5.5 లక్షల మంది పాల్గొనగా.. రాబోయే మూడో ఎడిషన్‌లో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంపికైన పేద క్రీడాకారుల వసతి, ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

- **ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**
- **సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**



తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.







# ప్రగతి పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన

- **విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని**
- **సీఐ నరేష్ సూచన**

**ఆదిలాబాద్ జిల్లా న్యూస్ ( డిడి9 వార్త న్యూస్ )**

యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ నరేష్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులు ఆరోగ్యపరంగా, మానసికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగంపై ఎలాంటి అనుమానాస్పద సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత తమ స్నేహితులను కూడా ఈ వ్యసనాల బారిన పడకుండా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రవీణ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, చట్టాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సీఐ నరేష్ అందించిన సూచనలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు ఆసక్తిగా విన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు.

# 20 ఏళ్ల సేవలకు ఇదేనా ప్రతిఫలం..?
# రోడ్డున పడనున్న 632 మంది టిసిసిఓలు!

- **సిసిఎల్ఏ మెమోతో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన**
- **ఒకవైపు జీతాలు లేవు...మరోవైపు ఉద్యోగ భద్రత లేదు**
- **32 జిల్లాల కలెక్టర్లు సేవలు కొనసాగించాలని సూచించినా పట్టించుకోని పరిస్థితి**
- **రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా పనిచేసిన ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకం**





**కామారెడ్డి, జూన్ 22 (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో గత రెండు దశాబ్దాలుగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించిన 632 మంది టైపిస్ట్‌కంకంప్యూటర్ ఆపరేటర్లు (టిసిసిఓలు) ప్రస్తుతం తీవ్ర ఆందోళన, అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.దాదాపు 20 సంవత్సరాలుగా ప్రభుత్వ సేవల్లో భాగమై పనిచేస్తూ రెవెన్యూ శాఖకు వెన్నెముకలా నిలిచిన వీరి భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాలు, రెవెన్యూ శాఖల్లో టిసిసిఓలు కీలక పాత్ర పోషిస్తున్నారు. భూముల రికార్డుల నమోదు, నిర్వహణ, రెవెన్యూ డేటా నమోదు, ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు సంబంధించిన పలు సేవల నిర్వహణలో వీరు నిరంతరం సేవలందిస్తున్నారు. ముఖ్యంగా డిజిటలైజేషన్ ప్రక్రియలో రెవెన్యూ శాఖలో వచ్చిన మార్పులకు అనుగుణంగా పని చేస్తూ ప్రభుత్వ వ్యవస్థలో అంతర్భాగంగా మారారు.అయితే ఇటీవల చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఏ) కార్యాలయం నుంచి టిసిసిఓల సేవలను నిలిపివేయాలని జారీ చేసిన మెమో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఒక్కసారిగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తమ ఉద్యోగ భద్రత ఏమవుతుందో, కుటుంబాల భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయం వారిని వెంటాడుతోంది.ఇప్పటికే పలు జిల్లాల్లో టిసిసిఓలు పెండింగ్ జీతాల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. చాలామంది ఉద్యోగులు తమ జీవితంలో అత్యంత విలువైన సమయాన్ని ప్రభుత్వ సేవలకే అంకితం చేశామని, ఇప్పుడు ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గం లేకుండా సేవలను నిలిపివేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ వ్యవస్థలో భాగమై పనిచేసిన తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం తక్షణం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని టిసిసిఓలు కోరుతున్నారు. లేకపోతే వందలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**32 జిల్లాల కలెక్టర్ల నివేదికలు కూడా పట్టించుకోలేదా..?**

టిసిసిఓల ఉద్యోగ సంఘాల సమాచారం ప్రకారం రాష్ట్రంలోని 32 జిల్లాల కలెక్టర్లు సైతం టిసిసిఓల సేవలు ఇప్పటికీ అవసరమని సిసిఎల్ఏ కార్యాలయానికి నివేదికలు సమర్పించినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలు, ప్రజా పరిపాలనలో వీరి పాత్ర కీలకమని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, జిల్లా స్థాయి అధికారుల అభిప్రాయాలు, అవసరాలపై నివేదికలు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సేవల నిలిపివేత దిశగా చర్యలు కొనసాగడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. క్షేత్రస్థాయిలో మా సేవలు అవసరమని అధికారులు చెబుతుంటే, ఉద్యోగాలను ఎందుకు ప్రశ్నార్థకం చేస్తున్నారో అర్థం కావడం లేదు అని టిసిసిఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకవైపు జీతాలు లేవు...**
**మరోవైపు ఉద్యోగ భద్రత లేదు**

ఇప్పటికే గత 12 నెలలుగా వేతనాలు అందక టిసిసిఓలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. నెలల తరబడి జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ సేవలో ఉన్నప్పటికీ, తమకు రావాల్సిన వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.పిల్లల విద్యా ఖర్చులు, ఇంటి అద్దెలు, వైద్య అవసరాలు, కుటుంబ పోషణ, రోజువారీ ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. కొందరు కుటుంబ అవసరాల కోసం అప్పులు చేస్తుండగా, మరికొందరు స్నేహితులు, బంధువుల సహాయం తీసుకుని జీవనం కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. జీతాలు లేక ఒకవైపు ఆర్థిక భారాలు పెరుగుతుండగా, ఇప్పుడు ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారడంతో మరింత ఆందోళనకు గురవుతున్నామని పేర్కొంటున్నారు.జీతాలు లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. ఇప్పుడు ఉద్యోగ భద్రత కూడా లేకపోతే మా కుటుంబాల పరిస్థితి ఏమవుతుంది? అంటూ పలువురు టిసిసిఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టిసిసిఓ ఉద్యోగుల ఆవేదన**

00మేము గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలో ఉన్నాం. ప్రజలకు సేవలు అందించాం. ప్రభుత్వ పనుల్లో భాగస్వాములమయ్యాం. కానీ ఇప్పుడు మా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మా కుటుంబాల పరిస్థితి ఏమవుతుందో తెలియడం లేదు అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.టిసిసిఓ సంఘ సభ్యులు ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ వారి ప్రధాన డిమాండ్లు ఉద్యోగాలను కొనసాగించాలి ,పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి,ఉద్యోగ భద్రతపై స్పష్టత ఇవ్వాలి,ఉద్యోగుల కుటుంబాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణలు చేపట్టాలి

- **తహసీల్దార్ అజ్మత్ నవాజ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

సాలూరులోని రైతు వేదికలో సోమవారం బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ అజ్మత్ నవాజ్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, తదితర అంశాలపై ఆయన వివరించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని, జాబితాలో మార్పులు, చేర్పులు చేసేటప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు, ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాల నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

- **బోధన్ జేఏసీ విద్యార్థి సంఘాల డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో గల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాల అభివృద్ధి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ, విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో విజయ కుమారికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నాగరాజు, కోకన్వీనర్ సంజయ్ మాట్లాడుతూ... పాఠశాల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.12 నుంచి 18 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. అయితే ప్రధానోపాధ్యాయుడు ఈ నిధులను విద్యార్థుల మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయకుండా, తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించుకున్నారని మండిపడ్డారు. గత నాలుగేళ్ల విద్యార్థుల అడ్మిషన్ రికార్డులను మాయం చేసి, అడిగితే నకిలీ బిల్లులతో బురిడీ కొట్టిస్తున్నారని వారు ఆరోపించారు. పాఠశాలలో కనీసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దుర్వినియోగం చేసిన నిధులను వెంటనే పాఠశాల ఖాతాలో జమ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎన్.బాలరాజ్, కిరణ్, ప్రశాంత్, రాజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.






# మురికి కాలువల శుభ్రతకు పాలకవర్గం ప్రత్యేక చర్యలు

**బీర్కూర్, జూన్ 22(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలం బరంగ్ ఎడ్గి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా మురికి మట్టి పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కాలువల శుభ్రత పనులను గ్రామ పంచాయతీ పాలకవర్గం చేపట్టింది. గత తొమ్మిది రోజులుగా సర్పంచ్ అనిల్ కుమార్ రెంజర్ల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పరిశుభ్ర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ్, వార్డు సభ్యులు శివకళ, బుమవ్వ, సాయిలు, గంగవ్వ, బాలేష్, యాదవరావు, అనిల్, హన్మండ్లు, రేణుక, పంచాయతీ సెక్రటరీ గురునాథ్, కరోబారి పర్వయ్య పాల్గొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని పాలకవర్గం సభ్యులు తెలిపారు.



# రైతులకు అవగాహన సదస్సు

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త) జూన్22**

తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంపై పలు సూచనలు చేశారు సంస్థ క్షేత్ర సహాయకుడు సంతోష్ మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలలో రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువుల వాడాలని మట్టి పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని పంట మార్పిడి అంతర పంటల విధానం మరి ముఖ్యంగా పురుగుమందుల పిచికారి సమయంలోతగిన జాగ్రత్తలు వాడాలని వాతావరణ మార్పుల వల్ల వచ్చే చీడపీడల గురించి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక లాభాలు పొందవచ్చు అన్నారు

# అర్హులకు అన్యాయం జరగొద్దు..
# అనర్హులకు చోటుండొద్దు

- **బోధన్ ఆర్‌డీఓ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బోధన్ శాసనసభ నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఆర్‌డీవో విజయకుమారి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు , బూత్ స్థాయి ఏజెంట్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఒక కార్యక్రమం నిర్వహించగా, రేంజల్ మండలం శాతాపూర్‌లోని యూనిక్యూ ఫంక్షన్ హాల్‌లో మరొక కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సాంకేతికతను జోడించి రూపొందించిన మొబైల్ యాప్ వినియోగంపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా రూపకల్పన అనేది అత్యంత బాధ్యతాయుతమైన పని అని, ఇందులో చిన్న పొరపాట్లకు కూడా తావుండకూడదని హెచ్చరించారు. జాబితా తయారీలో అత్యంత పారదర్శకత పాటించాలని, ఏ ఒక్క అర్హులైన ఓటరుకు కూడా అన్యాయం జరగకుండా చూడాలని, అదే సమయంలో ఒక్క అనర్హుడు కూడా జాబితాలో చోటు సంపాదించకుండా నిశితంగా పరిశీలించాలని ఆమె దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రతిచోటా అవగాహన బ్యానర్లను ఏర్పాటు చేయడంతో పాటు, ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. క్షేత్రస్థాయిలో సాధిస్తున్న రోజువారీ పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చించాలని, ప్రక్రియలో తలెత్తే సమస్యలను ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా తక్షణమే పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. బోధన్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా వంద శాతం పూర్తి చేసి తీరాలని ఆమె కఠినంగా ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో బోధన్, రెంజల్ తహసీల్దార్లు, ఆయా మండలాల అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.







# భూపాలపల్లి ఆర్టీవో హత్య వెనుక అసలు సూత్రధారులు ఎవరు?

- ఇసుక మాఫియా అరాచకాలకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణం
- బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు భూక్య జంపన్న

**ములుగు, జూన్ 22, డీ డీ 9 వార్త,**





భూపాలపల్లి జిల్లాలో ఆర్టీవో దారుణ హత్య తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక సాధారణ పౌరుడు కాదు, ప్రభుత్వ తరఫున చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత కలిగిన ఉన్నతాధికారి ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఘటన కేవలం ఒక హత్యగా చూడలేమని, రాష్ట్రంలో పెచ్చుమీరుతున్న ఇసుక మాఫియా అరాచకాలకు, వాటిపై ప్రభుత్వం చూపుతున్న ఉదాసీన వైఖరికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న అన్నారు.
, "నేడు ఒక ఆర్డీవో హత్యకు గురయ్యారంటే రేపు అక్రమాలను అడ్డుకునే ఏ అధికారి అయినా లక్ష్యంగా మారే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేసే అధికారులు భయంతో పనిచేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా విపరీతంగా పెరిగిందని ఆయన ఆరోపించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో, వాగుల్లో, చెరువుల్లో రాత్రింబవళ్లు జరుగుతున్న అక్రమ తవ్వకాలను ప్రజలందరూ చూస్తున్నారని, కానీ ప్రభుత్వం మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం బలహీనపడితే మాఫియాలు బలపడతాయని, ప్రస్తుతం తెలంగాణలో అదే పరిస్థితి నెలకొందని అన్నారు.
"ఇసుక మాఫియా అనేది ఒకరిద్దరు వ్యక్తులతో నడిచే వ్యవస్థ కాదు. కోట్లాది రూపాయల వ్యాపారం. అలాంటి అక్రమ వ్యవస్థలు రాజకీయ అండ లేకుండా, అధికార మంత్రులు స్థానిక ఎమ్మెల్యే ఆశీర్వాదం లేకుండా కొనసాగడం సాధ్యమేనా? ఈ ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని జంపన్న డిమాండ్ చేశారు. ఆర్డీవో హత్య వెనుక ఉన్న ప్రతి కోణాన్ని వెలికితీయాలని, కేవలం కింది స్థాయి వ్యక్తులను అరెస్టు చేసి కేసును ముగించే ప్రయత్నం చేయకూడదని ఆయన అన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు సూత్రధారులు, ఆర్థిక లబ్ధిదారులు, రాజకీయ పరిరక్షకులు ఎవరనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రస్తుతం ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ హత్య వెనుక ఇసుక అక్రమ రవాణా ముఠాల పాత్ర ఉందా? అధికార వర్గాల ఒత్తిళ్లు ఉన్నాయా? రాజకీయ నాయకుల పరమైన రక్షణ ఎవరికైనా ఉందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందన్నారు. అందుకే ఈ కేసును సాధారణ పోలీసు విచారణకు పరిమితం చేయకుండా హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
"ప్రజాస్వామ్యంలో అధికారులను రక్షించలేని ప్రభుత్వం, ప్రజలను ఎలా రక్షిస్తుంది? చట్టాన్ని కాపాడాల్సిన వారే ప్రాణాలు కోల్పోతే అది ప్రభుత్వ వైఫల్యం కాదా?" అని జంపన్న ప్రశ్నించారు.
ఇటీవల రాష్ట్రంలో అక్రమ మైనింగ్, ఇసుక దందాలు, భూ ఆక్రమణలు, కాంట్రాక్టర్ల పెత్తనం పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వానికి ఆదాయం రావాల్సిన సహజ వనరులు కొందరి చేతుల్లో బందీలుగా మారాయని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన నాయకుల పేర్లు తరచూ ఇలాంటి అక్రమాల్లో వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందని అన్నారు.
ఈ హత్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుమోటోగా కేసు నమోదు చేయాలని, సీబీఐ లేదా రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి స్థాయిలో ఉన్నా వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.
భూపాలపల్లి ఆర్డీవో హత్య ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు, ప్రభుత్వ వ్యవస్థపై జరిగిన దాడి అని భూక్య జంపన్న పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న నిజాలు బయటపడే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.
భూక్యా జంపన్న మాట్లాడుతూ, "తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు చేసినా ప్రజా న్యాయస్థానం ముందు ఎవరూ తప్పించుకోలేరు. ఈ హత్యకు సంబంధించిన ప్రతి అంశం వెలుగులోకి రావాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి. ఇసుక మాఫియా అరాచకాలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడాలి" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## బోధన్ ప్రజావాణిలో 11 దరఖాస్తులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన 11 దరఖాస్తులను స్వీకరించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. సకాలంలో దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

## బోథ్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యం లో డ్రగ్స్ అవగాహన సదస్సు

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ జూన్22 : (డిడి 9 వార్త న్యూస్ )**

మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ బోథ్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యం లో డ్రగ్స్ అవగాహన సదస్సులో బోథ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గురుస్వామి గారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు (Drugs) అనగా శరీరానికి, మెదడుకు తీవ్రమైన హాని కలిగించే ప్రమాదకరమైన మత్తు పదార్థాలు. వీటి వాడకం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవ్వడమే కాక, కుటుంబాలు ఛిద్రమై, సమాజంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి లక్షణాలు మరియు నివారణ మార్గాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించి వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించి అవగాహన కలిగించడం జరిగింది. పిల్లలు డ్రగ్స్ కు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని వారికి మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ఉదాహరణలతో పాటు పిల్లలకు చక్కగా వివరించి పిల్లలచే ప్రతిజ్ఞ చేయించడం జరిగినది .ఈ కార్యక్రమంలో బోథ్ ఎస్ఐ పురుషోత్తం గారు, పోలీస్ సిబ్బంది పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ అనురాధ మేడం గారు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పాలనా అంశాలపై వైద్యాధికారులకు శిక్షణ

**నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని డ్రాయింగ్ అధికారులైన వైద్యాధికారులకు పాలనాపరమైన అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ శిక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని అధికారులు ఎదుర్కొంటున్న సవాళ్లు, విధుల్లో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు.
శిక్షణ కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ జిల్లా కార్మిక అధికారి యోహాన్ మాట్లాడుతూ.. ఆఫీస్ సబార్డినేట్ రూల్స్, లీవ్ రూల్స్, మెమోలు మరియు షోకాజ్ నోటీసుల జారీ, డ్రాఫ్టింగ్, ప్రొసీడింగ్స్, లెటర్ రైటింగ్ వంటి అంశాలపై వైద్యాధికారులకు వివరించారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కేసులు, కోర్టు కేసులు ఎదురైనప్పుడు అనుసరించాల్సిన విధానాలు, వాటిని డీల్ చేసే పద్ధతులపై ఆయన శిక్షణ ఇచ్చారు. అనంతరం వైద్యాధికారులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సమత, డాక్టర్ సికందర్, ఏవో సుమంత్ కుమార్, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.



## ఐ ఎన్ టి యు సి,కాంట్రాక్ట్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ తండ్రిని పరామర్శించిన జనక్ ప్రసాద్.

**డిడి9వార్త / రామగుండం జూన్ 23:**



ఈరోజు ఐ ఎన్ టి యు సి,కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్ యాదవ్. తండ్రి ఉడుత రాయమల్లు
గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండని తెలుసుకొని వచ్చిన ఐ ఎన్ టి సి సెక్రెటరీ జనరల్ కనీస వేతన చైర్మన్ ప్రసాద్ తన యొక్క ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని ఇంకా ఇబ్బందిగా ఏమైనా ఉంటే నాకు తెలియండి పెద్ద హాస్పిటల్లో చేర్చాలని ధైర్యం చెప్పారు . తను మందులు తీసుకోమని ఆర్థికపరంగా 20.000రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో ఆర్.జి.3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ బండ కిరణ్ రెడ్డి మల్లూరి మల్లారెడ్డి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి వడ్డేపల్లి దాస్ ఐ ఎన్ టి యు సి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

ప్రజల సమస్యలను చట్టబద్ధంగా, వేగంగా పరిష్కరించడమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఓపికగా ఆలకించినట్లు తెలిపారు. మొత్తం 17 ఫిర్యాదులను స్వీకరించిన ఆయన వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత ఎస్సై, సిఐలకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా సమస్యల స్థితిగతులను అధికారులతో స్వయంగా చర్చించారు. ప్రజలు ఎటువంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి పోలీసు సేవలను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి : విజి గౌడ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్21(డీడీ9 వార్త):**

బోధన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ నివాసంలో సోమవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయనతో పాటు జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజి గౌడ్ మాట్లాడుతూ... పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడంలో కార్యకర్తల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీఆర్ఎస్ సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనే బలమైన ధీమాను ఆయన వ్యక్తం చేశారు.
అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ ఓటర్ రివిజన్ ప్రక్రియపై నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్పించేలా కార్యకర్తలు కృషి చేయాలని విజి గౌడ్, దాదన్నగారి విఠల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సంజీవ్ కుమార్, నర్సింగ్‌రావు, శ్రీరామ్, కౌన్సిలర్లు అశోక్ రెడ్డి, ముషీర్ బాబా, మోబీన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దైవదత్తాలు కాదు శాస్త్రీయ అంశాలే ప్రగతికి సోపానాలు

- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు

**బోనకల్,జూన్ 21,(డీడీ9 వార్త):**




శాస్త్రీయ దృక్పథంతో మాత్రమే సమాజం పురోగమిస్తుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో దైవదత్తం శాస్త్రీయత అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.పల్లా కొండలరావు మాట్లాడుతూ దేవుని పేరుతో మనిషి సృష్టించిన మూఢత్వపు ఆలోచనలు, ఆచారాలు సమాజ ప్రగతికి ఆటంకం కలిగిస్తాయన్నారు. సమాజం నిరంతరం మారుతుంటుందనీ ఆ మార్పు పురోగమనం వైపు ఉండేలా చూసేది శాస్త్రీయ దృక్పథం కలిగిన అభ్యుదయ శక్తులు కాగా యథాతథంగా సమాజం ఉండేలా చేసేవి మతోన్మాద ఛాందస శక్తులని తెలిపారు. ఏమిటి ఎందుకు ఎలా అనే సైంటిఫిక్ టెంపర్ ను చిన్నప్పటి నుంచి పిల్లల్లో నేర్పకపోతే సమాజం తిరోగమనం వైపు వెళుతుందన్నారు. తొంభై శాతం నాస్తికులు ఉన్న చైనా అన్ని రంగాల్లో దూసుకుపోతుంటే అడుగడుగునా దేవుళ్ళకు మొక్కే భారత్ అన్నింటా వెనకబడుతోందన్నారు. సమాజం బాగుపడాలంటే మూఢత్వం కంటే విజ్ఞానం పెరగాలన్నారు. ఓ గుడి కడితే లోపలా, బయటా రెండు రకాలుగా అడుక్కునే బిచ్చగాళ్ళు తయారవుతారన్నారు. అదే ఓ బడి కడితే ఎందరో మేధావులు, మహానుభావులు తయారై దేశంలో ఏ రకమైన బిచ్చగాళ్ళు లేకుండా చేస్తారని తెలిపారు. అయితే మతం పేరుతో సాగే భావజాలం వ్యాప్తి చెందినంత తేలికగా వైజ్ఞానిక బోధనలు ప్రజల మెదళ్ళకు ఎక్కించలేక పోతుండడం బాధాకరమన్నారు. వేమన పద్యాలు చెప్పినంత సులువుగా వైజ్ఞానిక బోధనలు ప్రజల భాషలో తేలిక ఉదాహరణలతో చెప్పగలిగే బోధకులు పెరగాలన్నారు. సమాజంలో ఏ అభివృద్ధి అయినా, వస్తువు అయినా ఆఖరుకు పూజారులు, పాస్టర్లు వాడే, అనుభవించే సౌకర్యాలు సైతం సైన్స్ ద్వారా కనుగొన్నవేనని తెలిపారు. మతంలో ఉన్న మంచిని స్వీకరిస్తూనే మూఢత్వంపై పోరాటం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యాలయాల్లో శాస్త్రీయ అంశాలు బోధించాలని కోరారు. దేవుడిపై పోరాడడం కంటే మనిషే తోటి మనిషికి సాయం చేయగలిగే దైవత్వం పెంచుకోవాలని సూచించారు. కరోనా సమయంలో అన్ని మతాల దేవాలయాలు మూతబడితే కాపాడిన దేవుళ్ళు ఎవరిని ప్రశ్నించారు. సర్వకాల సర్వావస్థలలోను దైవదత్తాలు కంటే శాస్త్రీయ అంశాలు మాత్రమే మానవాళికి ప్రయోజనం కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, సిఐటియు నాయకులు గుగులోతు నరేష్, పి.వి.అప్పారావు, చలమల హరికిషన్ రావు, బొప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమృత లింగేశ్వర సహిత శక్తి అమ్మవార్ల దేవాలయం షెడ్డు నిర్మాణానికి అమెరికా ప్రవాసి చక్రధర్ రూ.10 లక్షల విరాళం.

- దేవాలయ షెడ్డు నిర్మాణానికి ఎన్నో సహకారాలు అందించిన పోతరాజుల రాధా కిషన్- అంబికా దేవి,కుటుంబ సభ్యులు.

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 23:**



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన అమెరికా ప్రవాసి పోతరాజుల రాధాకిషన్ - అంబికాదేవి దంపతుల కుమారుడు పోతరాజుల చక్రధర్ అమెరికా ప్రవాసి గ్రామంలోని ఆలయ అభివృద్ధికి ఉదారంగా ముందుకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. దీనికి భూమి పూజ కార్యక్రమం వేద బ్రాహ్మణులు కమ్మల వామన్, నటరాజు శర్మ పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దాత అమెరికా ప్రవాసి చక్రధర్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా అభినందించారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్వగ్రామం పట్ల ఉన్న అభిమానం, ఆధ్యాత్మిక సేవాభావంతో ఆలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.గ్రామానికి చెందిన యువకుడు అమెరికా ప్రవాసి చక్రధర్ అందించిన ఈ విరాళంతో ఆలయానికి అవసరమైన షెడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు, పూజారి కమ్మల వామన్, నటరాజ్ శర్మ తెలిపారు. ఆయన సేవా స్ఫూర్తి ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారి కమ్మల వామన్, నటరాజ్ శర్మ కొనియాడారు.



# మోదీ తృతీయ సుపరిపాలనలో ప్రజాసంక్షేమ పథకాల అవసరం ఉద్దేశ్యంగా విద్యార్ధులకు విద్యాసామగ్రి పంపిణీ

- **రామగుండం నియోజకవర్గ సూచన మేరకు జనగామ ఎంపీపీ ఎస్ పవర్ హౌస్ కాలనీలో బిజెపి నేతల సమక్షంలో నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ**
- **పీఎం కిసాన్, ఆవాస్, జనధన్, సుకన్యా, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్, వందే భారత్, ఉచిత బియ్యం పథకాల అవగాహన**





**పెద్దపల్లి బ్యూరో, జూన్ 22 (డీడీ9 వార్త):** భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడు పర్యయాల (12 సంవత్సరాల) సుపరిపాలనను పురస్కరించుకుని, దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన ప్రవేశ పెట్టిన పలు స్థాయిల పథకాల అవసరాన్ని ప్రజల్లో అవగాహన కలిగించే స్థాయిలో జనగామ మండల పరిధిలోని ఎంపీపీఎస్ , పవర్ హౌస్ కాలనీ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ చేయబడింది.

బీజెపి రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషద్ ప్రాథమిక పాఠశాలకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేయబడ్డాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ పంపిణీలో బీజేపీ సీనియర్ నాయకుడు తడగొండ నర్సయ్య, మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, బియ్యాల మహేందర్, బండారి శ్యామ్, కొట్టే నరేష్, జక్కన బాలు, శిలారపు కల్యాణ్ తదితరులు పాల్గొని పిల్లలతో పాటు ఉపాధ్యాయులకి ఉత్సాహభరితంగా సామాగ్రి అందజేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కృత పి.ఎం. కిసాన్ యోజన, పి.ఎం. ఆవాస్ యోజన, జనధన్ యోజన, సుకన్య లక్ష్మా యోజన, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్, వందే భారత్ వంటి పథకాల ద్వారా గ్రామీణ మరియు నగర ప్రజల జీవనస్థాయిల అభివృద్ధికి కలిగిన ప్రయోజనాలను ప్రస్తావించారు. అదేవిధంగా ఉచిత రేషన్ బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా దుర్బలులకి సహాయమవుతుందని గుర్తుచేశారు.

# బాలిక పై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- **బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం – పోక్సో కేసులో నిందితుడికి కఠిన శిక్ష**
- **దోషులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బంది కోర్టు అధికారులను అభినందించిన**
- **జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్**




**ములుగు, డీ డీ 9 వార్త :** కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి మరియు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది.

ఈ కేసులో నిందితుడు అయిన కొరగట్ల సత్యనారాయణ (45), కన్నాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ గారు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.6,000 జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి మరియు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు శ్రీ కె. శివప్రసాద్ సీఐ, శ్రీ ఎం. రాజు సీఐలు కీలక పాత్ర పోషించారు.

కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.



# రైతులకు, వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసుకోవాలి.

- **ఈదురుగాలుల పట్ల విద్యుత్ శాఖ వారు అప్రమత్తంగా ఉండాలి.**
- **రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి.**
- **నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 23:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో మరియు జిల్లా సహకార అధికారి అలాగే ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులతో వానాకాలం సీజన్ పట్ల ముందస్తుగా సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..వానాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు మరియు విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అలాగే వానకాలంలో ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటాయని వాటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు మరియు వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసుకోవాలి తెలిపారు. పెద్దపల్లి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డు లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సురక్షితమైన, అనువైన ప్రదేశాల్లోకి మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించడం జరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని నియోజకవర్గంలో ఎలెక్ట్రిక్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచనలు చేశారు. వానాకాలం సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు మరియు విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు అందరూ ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించి రైతన్నలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలపై నిఘా ఉంచి వాటి అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాల బారిన పడకుండా చూసుకోవాలని ఆదేశించారు. విత్తనాలు అనేవి నిబంధనలకు అనుగుణంగా సజావుగా అమ్మకాలు సాగేలా చర్యలు తీసుకోవాలని అలాగే రైతులు కేంద్రాల వద్ద ఇబ్బంది పడకుండా డిజిటల్ ఎంట్రీలు, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిసివో శ్రీమాల కి విజయరమణ రావు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, విద్యుత్ శాఖ ఎస్.ఈ గంగాధర్ డి.ఈ రాజబ్రహ్మ చారి, , ఎ.ఈ లు, ఎ.డి.ఈ లు, పాక్స్ కార్యదర్శులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టి పి సి ఎస్ ఆర్ రెండు నెలల కంప్యూటర్ శిక్షణ విజయవంతంగా ముగింపు

- **దీప్తి మహిళా సమితి సహకారంతో నిర్వహించిన డి సి ఏ, కంప్యూటరైజ్డ్ ట్యాలి విత్ జీఎస్టీ కోర్సులు పూర్తి చేసిన వారికి తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ విభాగం నుండి సర్టిఫికెట్‌లు**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 22 (డీడీ9 వార్త):** ఎన్టిపిసి సంస్థ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కార్యక్రమం కింద నిర్వహించిన రెండు నెలల సర్టిఫైడ్ కంప్యూటర్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. సాయి సేవ సమితి సమీపంలోని వృత్తి శిక్షణ కేంద్రంలో జరిగిన వాలెడిక్టరీ కార్యక్రమానికి దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డి.ఎం.ఎస్ సీనియర్ సభ్యులు, అధ్యాపకులు, సి ఎస్ ఆర్ ప్రతినిధులు మరియు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎన్ టి పి సి ఎస్ ఆర్ విభాగం, దీప్తి మహిళా సమితితో కలిసి స్థానిక యువతలో ఉపాధి అవకాశాలు మరియు డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించింది. డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ (డి సి ఏ), డిప్లొమా ఇన్ కంప్యూటరైజ్డ్ ట్యాలి విత్ జీఎస్టీ కోర్సులు ద్వారా పరిశ్రమకు అనువైన ప్రాయోగిక నైపుణ్యాలు బోధించారు. సభలో మాట్లాడిన శ్రీమతి రాఖీ సామంత..., శిక్షణార్థుల కృషి, నిబద్ధతను అభినందిస్తూ, సంపాదించిన జ్ఞానాన్ని కెరీర్ అభివృద్ధికి, సమాజానికి ఉపయోగపడేలా వినియోగించుకోవాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన అందరికీ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ శాఖ నుండి సర్టిఫికెట్‌లు అందించనున్నారు.




# సింగరేణి ప్రాంతాన్ని సందర్శించిన ఎస్ ఏ టి జి, వైస్ ఛైర్పర్సన్ &మేనేజింగ్ డైరెక్టర్.

- **వారితోపాటు ఆర్ జి -1జి ఏం,డి లలిత్ కుమార్ పాల్గొన్నారు.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 23:** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ ఏ టి జి ) వైస్ చైర్‌పర్సన్ & మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమిషనర్, అకోయిజం సోనీ బాలా దేవి, ఐ ఎఫ్ ఎస్,ఈరోజు సింగరేణి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులు, క్రీడా శిక్షకులు మరియు క్రీడా శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలు, పట్టణాలు మరియు సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం రామగుండంలోని సింగరేణి అతిథి గృహం (గెస్ట్ హౌస్ ) ప్రాంగణాన్ని సందర్శించిన శ్రీమతి సోనీ బాలా దేవి గారు పారిజాత (పారిజాతం ) మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (అటవీ) భానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సోనీ బాలా దేవి తెలిపారు .



# అభివృద్దే లక్ష్యంగా అన్నపురెడ్డిపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ..

**అశ్వరావుపేట:జూన్22 (డిడి 9 వార్త)** అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు సోమవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు

ముందుగా తొట్టిపంపు గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న డైనింగ్ హాల్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన చేశారు అలాగే పెంట్లం గ్రామపంచాయతీ పరిధిలోని భాస్కరపురం, కంపగూడెం, నామవరం గ్రామాల్లో రూ.30 లక్షల వ్యయంతో మూడు ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించారు అనంతరం నరసాపురం గ్రామపంచాయతీ పరిధిలోని నరసాపురం రాజాపురం గ్రామాలలో రూ.15 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న సీసీ రోడ్లు కాంపౌండ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు అలాగే గ్రామపంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి విద్యా సంస్థల బలోపేతం మెరుగైన రహదారి సౌకర్యాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు ఉప సర్పంచులు వార్డు మెంబర్లు అనుబంధ సంఘాల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పెద్దపూర్ లో గాలి వాన బీభత్సం

- **నిరుపేద ఇల్లు నేల మట్టం**
- **ఆందోళనలో బాధిత కుటుంబం**
- **కుటుంబాన్ని ఆదుకోవాలి కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సుక్రు**

**- భూపాలపల్లి, ములుగు, డీ డీ 9 వార్త :** భూపాలపల్లి జిల్లాలోని పెడ్డాపూర్ గ్రామంలో ఈదురు గాలుల బిబస్తవంతో నీరు పేద కుటుంబం ఇల్లు నెల మట్టం అయింది. సోమవారం గాలి వానా రావడంతో పెద్దపూర్ లో మూల రవి కి చెందిన రేకుల సెడ్డు పైకప్పు పూర్తి గా గాలిలో లేచి పోయింది. దీనితో కుటుంబం వీదిన పడింది. ఆ కుటుంబానికి తీవ్ర నష్టం జరగడంతో ఆందోళనకు గురయ్యారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులు శుక్రు ప్రభుత్వాన్ని కోరారు.



## మంగళవారం నాడు కొత్తగూడెం ఏరియా లో జరిగే సింగరేణి పరిరక్షణ సదస్సు విజయవంతం చేయాలని గోడ పత్రిక ఆవిష్కరణ..

- **గోడ పత్రికను ఆవిష్కరించిన మణుగూరు ఏరియా TBGKS నాయకులు.**

**మణుగూరు.జూన్ 22(డి డి 9వార్త)**

కాంగ్రెస్ పాలనలో సింగరేణి కన్నీరు పెడుతుందని సిరిసంపదలు కలిగిన సంస్థను అసమర్థ పాలనతో స్కాం ల సంస్థ గా మార్చారని టి బి జి కె యస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఊకంటి ప్రభాకర రావు, ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ నెల 23 తేదీ సాయంత్రం 05 గంటలకు కొత్తగూడెం ఏరియా నందు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కాంగ్రెస్ హటావో సింగరేణి బచావో సింగరేణి పరిరక్షణ సదస్సు గోడ పత్రికను పీవీ కాలనీ జయ శంకర్ సార్ టిబిజికెయస్ కార్యాలయంలో వారంత కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశ నిర్దేశం, టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి నాయకత్వం లో సింగరేణి పరిరక్షణ పేరిట దశల వారి పోరాటాలకు శ్రీకారం చుట్టడం జరిగింది, అందులో భాగంగా ఈ నెల 23 వ తేదీన సాయంత్రం 05గంటలకు కొత్తగూడెం ఏరియా నందు కొత్తగూడెం క్లబ్ హాల్ లో పెద్ద ఎత్తున సింగరేణి పరిరక్షణ కోసం సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి ఆర్ యస్ పార్టీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు హాజరు కానున్నారని ఆయన తో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దీరాజు రవిచంద్ర, టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవిందర్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బి ఆర్ యస్ పార్టీ మాజీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగ కాంతరావు,కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్, హరిప్రియ, అశ్వారావు పేట మాజీ ఎమ్మెల్యే మరియు కేంద్ర టి బి జి కె యస్ నాయకత్వం అన్ని ఏరియాల టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ లు , బి ఆర్ యస్ నాయకులు, టిబిజిజేయస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు సభా అధ్యక్షులుగా టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు, మిర్యాల రాజిరెడ్డి వ్యవహరించనున్నారని వారు తెలిపారు. సింగరేణి కార్మికులపై కాంగ్రెస్ కుట్రలు, తప్పుడు బొగ్గు నిల్వలు, సింగరేణి పై ఆర్థిక భారం మెడికల్ బోర్డు రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ కుట్రలు, కేసీఆర్ పాలన లో ఇచ్చిన డిపెండెంట్ ఉద్యోగాలపై విజిలెన్స్ వేధింపులు, 54 వేల కోట్ల రాష్ట్ర ప్రభుత్వ బొగ్గు బకాయిలు, మారు పేర్లు, విజిలెన్స్ కేసుల పరిష్కారం, గైర్హాజర్ కార్మికుల అక్రమ డిస్మిస్ లు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణల పై సదస్సులో హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తావించనున్నారని వారు తెలిపారు. సంస్థ ప్రగతి కార్మిక సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టి బి జి కె యస్ చేసే పోరాటాలకు కార్మిక వర్గం అండగా నిలవాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మణుగూరు సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్, మస్తాన్, జంగం రాజ్ కుమార్, సివిల్ మోహన్ ప్రవీణ్ కుమార్, కమటం పరమేష్, ఐ శంకర్ గుగులోత్ రమేష్ నాయక్, జానీ పాషా, గుగులోత్ రమేష్ నాయక్, ఉపేందర్, తిరుపతి, డాల వెంకట్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## బాలిక పై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- **బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం – పోక్సో కేసులో నిందితుడికి కఠిన శిక్ష**
- **దోషులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బంది కోర్టు అధికారులను అభినందించిన**
- **జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్**

**ములుగు, డీ డీ 9 వార్త :**

కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి మరియు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది. ఈ కేసులో నిందితుడు అయిన కొరగట్ల సత్యనారాయణ (45), కన్నాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ గారు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.6,000 జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి మరియు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు శ్రీ కె. శివప్రసాద్ సీఐ, శ్రీ ఎం. రాజు సీఐలు కీలక పాత్ర పోషించారు. కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.







# డీడీ 9 వార్త కథనానికి స్పందన

- **ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌లోని నిర్మాణాలు నేలమట్టం**
- **గండిపేట్ రెవెన్యూ అధికారుల చర్యలు**
- **ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉపేక్షించేది లేదు**
- **ఎంతటివారైనా చట్ట పరమైన చర్యలు తప్పవు**
- **తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి**

**గండిపేట్,జూన్ 22 డిడి 9 వార్త**

గండిపేట్ చెరువు ప్రధాన వరద కాలువపై ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)బఫర్ జోన్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై డీడీ 9 వార్త పత్రికలో ఈ నెల 10 వ తేదీన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు.గండిపేట మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని మచిలేశ్వర స్వామీ దేవాలయం వద్ద సర్వే నంబర్లు 327, 328, 329లో చేపట్టిన నిర్మాణాలను భారీ పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట్ చెరువు నుంచి ప్రవహించే ప్రధాన వరద కాలువ సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు రెవెన్యూ,ఇరిగేషన్ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.సర్వేలో భాగంగా ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను గుర్తించి భారీ యంత్రాలతో తొలగించారు. మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ లో భాగంగా అలాగే వర్షాకాలం నేపథ్యంలో వరద నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు.కాలువలు, చెరువులు,ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. డీడీ 9 కథనంతో విషయం వెలుగులోకి రావడంతో అధికారులు వేగంగా స్పందించి చర్యలు చేపట్టడాన్ని స్థానికులు స్వాగతించారు.వరద ముప్పు నివారణకు ఇలాంటి చర్యలు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.





## ఇసుక దోపిడీ పై విచారణ చేపట్టాలి

- **ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బడే నాగజ్యోతి**
- **డీ డీ 9 వార్త, ములుగు :**
- **ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి**
- **మీడియా సమావేశం నిర్వహించి ఘాటు వ్యాఖ్యలు చేశారు.**

మంత్రి సీతక్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విమర్శించే నైతిక హక్కు లేదని బడే నాగజ్యోతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

మేడారం జాతర అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడారం పనుల విషయంలో అధికార పార్టీ మంత్రుల మధ్య ఆధిపత్య పోరు నడిచిందని, ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకున్న ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. దొంగ సర్టిఫికెట్లతో రాజకీయాలు చేస్తూ, ప్రజలను మోసం చేస్తున్న నాయకులు నేడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ములుగు జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, వేల కోట్ల రూపాయల అక్రమ ఇసుక వ్యాపారం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ లాంటి సమర్థవంతమైన నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేయించడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన వారు అధికార పార్టీకి చెందినవారే కాదా అని ప్రశ్నించారు.

గిరిజనుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చి, కొందరు నాయకులు మరియు వారి అనుచరులు మాత్రమే లబ్ధి పొందుతూ గిరిజన సంఘాల సభ్యులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సంపదను దోచుకుంటూ, అవినీతికి పాల్పడుతున్న వారికే ప్రజల శాపనార్థాలు తగులుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు దేవుళ్లను, ఆధ్యాత్మిక అంశాలను రాజకీయాలకు వాడుకోవడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు అవాస్తవమని భావిస్తే, మంత్రి సీతక్క ములుగు నడిబొడ్డున బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ములుగు జిల్లాలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న రూ.4,000 కోట్ల ఇసుక అక్రమ దోపిడీపై సీబీఐ విచారణకు ఆదేశించి నిజానిజాలు ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అవినీతి చేసిన వారెవ్వరైనా శిక్ష తప్పదని, ప్రజా ధనం దోచుకున్న వారి అసలు ముఖాలు త్వరలోనే బయటపడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి గారు జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అకుతోట చంద్రమౌళి ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు బైకని అనూష సాగర్ కోగిల లక్ష్మీ సర్పంచులు తప్పెట్ల రాజేందర్ దాసరి సరిత రమేష్ మాజీ గొర్రె సమ్మయ్య మాజీ సర్పంచ్ రాజన్న నాయకులు కాకి పురుషోత్తం ఉయ్యాల భద్రయ్య వాంకుడోత్ రాందాస్ మెరుగు సంతోష్, జిల్లా నాయకులు కొమరం సిద్ధు, పార్టీ మహిళా విభాగం నేతలు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## ఇసుక మాఫియా అక్రమాలకు బలైపోయిన నిండు ప్రాణం..

- **సాంబాయిగూడెం లో భారీగా స్తంభించిన ట్రాఫిక్..**
- **ప్రధాన రహదారి పైనే లారీల పార్కింగ్ -- వాహనదారుల ఇబ్బందులు..**
- **ట్రాఫిక్ లో చిక్కుకున్న అంబులెన్స్ -- బాధితుడిని చేతులపై మోసుకెళ్లిన వైనం.**
- **తీవ్ర జాప్యం జరగడంతో ప్రాణాలు కోల్పోయిన దయనీయం.**
- **అరగంట ముందు తీసుకువస్తే బతికేవాడని తెలిపిన వైద్యులు.**

**మణుగూరు.జూన్ 22 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని సాంబాయిగూడెం గ్రామం వద్ద హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది.మణుగూరు ఏటూరునాగారం ప్రధాన రహదారి పై సాంబాయిగూడెం రామానుజవరం గ్రామాల మధ్య రహదారిపై ఇసుక లారీలు నిలిపి ఉంచడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అదే సమయంలో మణుగూరు మండలం దమ్మక్క పేట గ్రామంలో పురుగుమందు తాగిన వంశీ (35) అనే వ్యక్తిని ఆసుపత్రికి తరలించే అంబులెన్స్ వాహనానికి దారి దొరకకపోవడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. దాంతో కుటుంబ సభ్యులు అతడిని భుజాలపై మోస్తూ తీసుకుని వెళ్లినా అప్పటికే తీవ్ర జాప్యం జరగడంతో వంశీ ప్రాణాలు కోల్పోయాడు. ట్రాఫిక్ జామ్ ఏర్పడక పోతే తమ వాడు బ్రతికేవాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఇసుక మాఫియా అరాచకాలపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.సాంబాయిగూడెం రామానుజవరం గ్రామాల మధ్య రహదారిపై ఇసుక లారీలు అక్రమ పార్కింగ్ వల్లనే భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.పురుగుమందు తాగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్ ఈ ట్రాఫిక్ లో చిక్కుకుపోయింది.

వాహనాలు దారి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమీ లేక బాధితుడిని చేతులపైనే మోసుకువెళ్లాల్సి వచ్చింది.అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై అడ్డగోలుగా నిలిపి ఉంచుతున్న లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేదని వారు ఆరోపిస్తున్నారు.



## కార్మిక వాడలలో రక్షణ చర్యలు చేపట్టండి

- **గ్రీవెన్స్ డే లో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన మాజీ జెడ్పీటీసీ దుర్గ..**
- **బాంబే కాలనీ, PVకాలనీ చుట్టూ రక్షణగా ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలి..**

**మణుగూరు.జూన్ 22(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు ఏరియాలోని సింగరేణి కార్మికులు నివసిస్తున్న కార్మిక వాడలలో పెరుగుతున్న భద్రతా సమస్యలపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏరియాలోని పివి కాలనీ, స్పెషల్ డి కార్మిక వాడలలో ఆక్రమణలు, అసాంఘిక కార్యకలాపాలు, అధిక వేగంతో వాహనాల సంచారం, శబ్ద కాలుష్యం, విషజంతువుల బెడద వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యు లు ప్రశాంతంగా జీవించే పరిస్థితులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. కాలనీలలో ఖాళీ స్థలాల ఆక్రమణలను సింగరేణి యాజమాన్యం అరికట్టడంతో పాటు రాత్రి వేళల్లో భద్రతా పర్యవేక్షణను పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వాహనాల వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సూచిం చారు.అలాగే కార్మిక వాడల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి పాములు, పందులు, ఇతర జంతువుల సంచారాన్ని నివారించాలని, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని ఆమె కోరారు.

కార్మికుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సింగరేణి యాజమా న్యం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.



# పట్టా భూములు, సీతమ్మసాగర్ డి-సిల్టేషన్ పేరుతో గోదావరి ఇసుక దోపిడీ జరుగుతోందని బీ ఆర్ఎస్ ఆరోపణ

**మంగపేట జూన్ 22డీడీ 9 వార్త**

మంగపేట, ములుగు జిల్లా: మంగపేట మండలంలోని గంపోనిగూడెం గ్రామ సమీపంలో, పొదుమూరు రెవెన్యూ పరిధిలోని పట్టా భూములను అడ్డంగా పెట్టుకుని సీతమ్మసాగర్ ప్రాజెక్టు డిసిల్టేషన్ పేరుతో గోదావరి నదిలో భారీ స్థాయిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, జిల్లా సీనియర్ నాయకులు కుదుముల లక్ష్మీనారాయణ ఆరోపించారు.

ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర శాఖల అనుమతుల పేరుతో, రాజకీయ అండదండలతో కొందరు ఇసుక కాంట్రాక్టర్లు గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తూ కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు.

**అక్రమ ఇసుక తవ్వకాలపై ఆరోపణలు**

మండల కేంద్రానికి సమీపంలోని దొంగలవారె ప్రాంతంలో నడి గోదావరిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వి, లారీల ద్వారా తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం పూర్తిగా అక్రమమని తెలిసినా, కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకుని అధికార పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు.

గోదావరి ఒడ్డునుంచి కిలోమీటర్ల మేర నదిలో రహదారి నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

**ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలపై ప్రశ్నలు**

గతంలో ఇదే ప్రాంతంలో గంపోనిగూడెం గిరిజన సహకార సంఘం ఇసుక క్వారీ అనుమతి కోరగా, ఆ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో ఉందని పేర్కొంటూ అనుమతి నిరాకరించారని గుర్తుచేశారు. అయితే అదే ప్రాంతంలోని పట్టా భూములకు ఇసుక తవ్వకాల అనుమతులు ఎలా మంజూరు చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘానికి వర్తించిన నిబంధనలు పట్టా భూములకు వర్తించవా? లేక అధికార పార్టీ ఒత్తిడితో నిబంధనలను పక్కనపెట్టి అనుమతులు ఇచ్చారా అని ప్రశ్నించారు.

**కరకట్ట, రహదారి నిర్మాణంపై అనుమానాలు**

పొదుమూరు ప్రాంతం నుంచి కరకట్ట నిర్మాణం ఇప్పటికే చేపట్టబడిందని, పాత కరకట్ట నిర్మాణ అవశేషాలను తొలగించి రహదారి ఏర్పాటు చేసి ఇసుక తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

**గిరిజనుల పట్ల వివక్ష ఆరోపణ**

గిరిజనులకు అండగా ఉంటామని చెప్పుకునే ప్రభుత్వం, గిరిజన సహకార సంఘానికి అనుమతి నిరాకరించి, అదే ప్రాంతంలోని పట్టా భూములకు అనుమతులు ఇవ్వడం వెనుక కారణాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

**డి-సిల్టేషన్ పేరుతో అక్రమాలకు అవకాశం**

సీతమ్మసాగర్ ప్రాజెక్టు డిసిల్టేషన్ పేరుతో మంగపేట మండలంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇది పూర్తిగా అనుమానాస్పద వ్యవహారమని పేర్కొన్నారు.

RTI ద్వారా ప్రభుత్వమే ఇచ్చిన సమాచారం ప్రకారం మంగపేట మండలంలోని ఏ గ్రామమూ సీతమ్మసాగర్ ప్రాజెక్టు ముంపు పరిధిలోకి రావడం లేదని తెలిపారు. అలాంటి



పరిస్థితిలో డిసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎవరి ఒత్తిడితో ఇచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**NGT ఉత్తర్వుల ప్రస్తావన**

జాతీయ హరిత ట్రిబ్యునల్ (NGT) ఉత్తర్వుల మేరకు 24 మార్చి 2023న సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నిలిపివేయబడ్డాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టు పేరుతో ముంపు ప్రభావం లేని ప్రాంతాల్లో డిసిల్టేషన్ చేపట్టడం ఎంతవరకు చట్టబద్ధమో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు.

**ముంపు మండలాలపై స్పష్టత కోరిన బిఆర్ఎస్**

సీతమ్మసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రభావం ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకే పరిమితమైందని పేర్కొంటూ, ములుగు జిల్లా మంగపేట మండలాన్ని ముంపు ప్రాంతంగా ఎప్పుడు ప్రకటించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి సవాల్**

డిసిల్టేషన్ పేరుతో జరుగుతున్న ఇసుక తవ్వకాల ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారో ప్రజలకు తెలుసునని, అక్రమ ఇసుక క్వారీల వెనుక ఎవరి హస్తం ఉందో అధికార పార్టీ నాయకులు బహిరంగంగా వెల్లడించాలని కోరారు. లేదంటే వెంటనే క్వారీలను మూసివేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

ఈ అంశంపై అధికార పార్టీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరిన శ్రీ కుదుముల లక్ష్మీనారాయణ, అధికార అండతో అక్రమ అనుమతుల ద్వారా గోదావరి సహజ సంపదను దోచుకునే ప్రయత్నాలకు ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, జిల్లా నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, చల్ల గురుగుల తిరుపతి, టైలర్ వెంకట్ రెడ్డి, పిల్లల మర్రి వేణు, గౌని రమేష్, లక్ష్మణ్, గడ్డి సునీల్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# గోవిందరావుపేట మండల యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా భైరి అభిలాష్ నియామకం...

- **నియామక పత్రాన్ని అందజేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

సోమవారం అనగా ఈరోజున గోవిందరావుపేట మండల పసర గ్రామం నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయగా అట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ విచ్చేసి గోవిందరావుపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా భైరి అభిలాష్ ని నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

అనంతరం అశోక్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు వస్తాయని దానికి నిదర్శనం భైరి అభిలాష్ గారే అని, అలాగే కాంగ్రెస్ పార్టీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన అభిలాష్ గారు కాంగ్రెస్ పార్టీ నియమ, నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువజన నాయకులను అందరినీ ఏకం చేసి ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కోరుతూ నూతనంగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన భైరి అభిలాష్ గారికి అభినందనలు తెలియజేస్తున్న అని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. ఇస్సార్ ఖాన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి గార్లు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఫ్రీ-ప్రైమరీ, పీఎంఎస్ఈ కేంద్రాల విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..

- **ఎంఈఓ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ధర్నా...**
- **అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కె .సమ్మక్క డిమాండ్.**

**గోవిందరావుపేట, జూన్ 22(డిడి 9 వార్త)**

ఫ్రీప్రైమరీ, పీఎంఎస్ఈ కేంద్రాల విలీన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కె సమ్మక్క డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఫ్రీప్రైమరీ విలీనాన్ని రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు.అనంతరం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) గొంది దివాకర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.దీనిపై స్పందించిన ఎంఈఓ దివాకర్, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సమ్మక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఫ్రీప్రైమరీ, పీఎంఎస్ఈ కేంద్రాల విలీన నిర్ణయం అంగన్‌వాడీ వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు.ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం విరమించుకుని, అంగన్‌వాడీ కేంద్రాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి తాడ్వాయి ప్రాజెక్టు అధ్యక్షురాలు పద్మారాణి. గోవిందరావు పేట సెక్టార్ అధ్యక్షురాలు ఎన్ ధనలక్ష్మి పసర సెక్టార్ బాధ్యులు భాగ్యమ్మ పి శాంత సిహెచ్ దీప అరుంధతి మండలంలోని వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.




# జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్ఎంహెచ్ హాస్టల్లు మంజూరు చేయాలి

- **ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి**
- **ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి**
- **ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా**
- **ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు**

**ములుగు, జూన్ 22, డీ డీ 9 వార్త :**

జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్ఎంహెచ్ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్లను వెంటనే మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తరగతి గదులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్ఎంహెచ్ విద్యార్థులకు వసతి కల్పించే హాస్టళ్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే హాస్టళ్లను మంజూరు చేసి విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయని, అందువల్ల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొచ్చు సందేశ్, కీర్తన, సింధు, ఉష, వర్ష తదితరులు పాల్గొన్నారు.




# బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను స్వీకరించిన కాంగ్రెస్ నాయకులు

- **మేడారం, ములుగులో చర్చలకు హాజరుకాని బీఆర్ఎస్ నేతలు**
- **ఆధారాలతో బహిరంగ చర్చలకు సిద్ధమని కాంగ్రెస్ స్పష్టం**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలన అభివృద్ధిపై సమాధానం చెప్పాలని డిమాండ్**
- **రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందు పెడతామన్న నాయకులు**
- **మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరిక**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ విసిరిన సవాళ్లను స్వీకరిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చర్చలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్, మాజీ రెడ్కో చైర్మన్ గుంటూరు సతీష్‌రెడ్డి విసిరిన సవాల్ మేరకు కాంగ్రెస్ నాయకులు మేడారం గద్దెల వద్దకు చేరుకున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు హాజరుకాలేదని తెలిపారు. అనంతరం ములుగులో బహిరంగ చర్చలకు రావాలని మరోసారి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి సవాల్ విసిరారని, ఆ సవాల్‌ను కూడా స్వీకరించి గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు చర్చలకు రాకుండా తప్పించుకున్నారని విమర్శించారు.

ప్రజల ముందు వాస్తవాలు చెప్పే ధైర్యం లేకనే బీఆర్ఎస్ నాయకులు చర్చలకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం, నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని ఆధారాలతో చర్చలకు రావాలని సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ములుగు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సంఖ్య, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలు, సంక్షేమ పథకాల అమలు గురించి తాము ప్రజల ముందు వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ములుగు అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి దనసరి అనసూయ సీతక్కపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయాలు చేయవద్దని బీఆర్ఎస్ నాయకులకు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల తీర్పును గౌరవిస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# Iవ వార్డులో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న ప్రజా ప్రతినిధులు.

- **తమ ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపు.**

**మణుగూరు.జూన్ 22(డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల 1వ వార్డు, వాగు మల్లారం గ్రామంలో సోమవారం పర్యటించి స్థానికంగా ఉన్న డ్రైనేజీలు మరియు ఇతర పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఇళ్లలోనే కాకుండా,పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సమితిసింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, ఎండి యాకూబ్ అలీ, చెన్నబోయిన రాంబాబు, త్రివేణి, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసైన్మెంట్ భూములే లక్ష్యంగా అక్రమ మట్టి దందా













- **నిద్ర మత్తులో మండల అధికారులు....**
- **ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు...**

**బోనకల్,జూన్ 22,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో అక్రమార్కులు అభివృద్ధి పనులు పనులు పేరు చెప్పి... నిబంధనలు తుంగలో తొక్కి.. పర్మిషన్ లేకుండా యదేచ్ఛగా అక్రమ మట్టి దందా కొనసాగిస్తున్నారు.గత వారం రోజుల నుంచి గ్రామంలో అసైన్మెంట్ భూములను లక్ష్యంగా చేసుకుని ఒక క్వారీ ఏర్పాటు చేసి ఆంధ్ర టిప్పర్ల ద్వారా మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కండ్ల ముందు ఇంత జరుగుతున్నా.. స్థానికులు ఆరోపిస్తున్న... వివిధ శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్వారీలకు కూతవేటు దూరంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా అక్రమార్కులు అక్రమ మట్టి దందా నిర్భయంగా కొనసాగించడంపై పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అసైన్మెంట్ భూముల నుంచి అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




• ది శ్రీరామ్ అకాడమి సాగిస్తున్న అక్రమ కట్టడాల పై డిడి9 వార్త సోమవారం ప్రచురించిన "ది శ్రీ రామ్ అకాడమీ అరాచకం" అనే శీర్షిక ప్రకంపనలు సృష్టించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి దీంతో అధికార యంత్రాంగం స్పందించింది ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం

సమాజంలో విద్యావేత్తగా చలామణి అవుతూ... చెరువును చెర బట్టి,నాలాను కబ్జా చేసి,భావి తరాల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న విధ్వంసకర్త "ది శ్రీ రామ్ అకాడమీ అధినేత"అరాచకం నార్సింగి సర్కిల్ 45లో వివాదాస్పదంగా మారింది.గౌలిదొడ్డి లో ఉన్న చంద్రకుంట చెరువును మింగి ది శ్రీ రామ్ అకాడమీ కార్పొరేట్ స్కూల్ పేరుతో భారీ బహుళంతస్థుల నిర్మాణాలు సాగిస్తున్నారు, ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ పాఠశాల నిర్వాహకుడు వైట్ కాలర్ ముసుగులో అధికారులను మేనేజ్ చేసుకుని నిర్మాణాలు చేపట్టడంలో సిద్ధహస్తుడిగా పేరున్నట్లు తన అనుచరులు పేర్కొనడం గమనార్హం. అవసరాల కోసం ఎంతటికైనా దిగజారతాడనే విషయం ఇప్పుడు చంద్రకుంట చెరువు నాలా ను ఆక్రమించి భావి తరాల భవిష్యత్తు నాశనం చేస్తు నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చూస్తే ఇట్టే అర్ధం చేసుకోవచ్చు అని స్థానిక ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. 111 జీవో ఉల్లంఘిస్తూ జంట జలసేయాల భక్షకుడు గా మారి చేస్తున్న అరాచకాలాకి తనలో ఉన్న మానేజ్మెంట్ స్కిల్ అదనపు బలం గా చేకూరింది అని దీంతో అధికారులను కొనడంలో సైతం ఆయన సిద్ధహస్తుడు అని వారి అనుచరులే గొప్పలు చెప్పడం విశేషం.చెరువులను చెరబట్టి నాలా పైనే బహుళంతస్థుల భవనాలు నిర్మించి ప్రభుత్వానికే సవాలు విసిరిన "ది శ్రీ రామ్ అకాడమీ ఇంటర్నేషనల్ స్కూల్" అక్రమంగా సాగుతున్న నిర్మాణం పై డిడి9 వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం

**డిడి9 వార్త ఇన్వెస్టిగేషన్ విభాగం,హైదరాబాద్:**

"ది శ్రీ రామ్ అకాడమీ" సంపన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని భారీ ఫీజులు వసూలు చేస్తోందనే విమర్శలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఒక నర్సరీ విద్యార్థి కి కట్టే ఫీజుతో ఒక సామాన్యుడు తన కుటుంబాన్ని 10 సంవత్సరాల బ్రతికెయ్యొచ్చు అనేది సంస్థ అధికారిక వెబ్సైట్లో పేర్కొన్న ఫీజు నిర్మాణాలను చూస్తే తెలుస్తుంది. సాధారణ కుటుంబాలకు అందని రీతిలో విద్యను వ్యాపారంగా మార్చి కోట్ల గడిస్తున్నారు. ఇది సరిపోదు అన్నట్లుగా 111 జిఓ లో అనధికారిక నిర్మాణాలు జరుపుతూ చెరువు ను చెరబట్టి నాలా పైననే నిర్మాణాలు జరుపుతూ అక్రమ సంపాదనకు తెరలేపాడని నార్సింగి సర్కిల్ 45 పరిధిలోని గౌలిదొడ్డి లో రత్నదీప్ సూపర్ మార్కెట్ ఎదురుగా చంద్రు కుంట చెరువు ఆక్రమించి నిర్మిస్తున్న భారీ భవనాన్ని చూస్తే అర్థమవుతుంది.సమాజంలో ఒక ఉన్నత స్థాయి విద్య వ్యవస్థ వ్యాపారంలో ఉన్న వ్యక్తి నలుగురికి ఆదర్శంగా నిలవాల్సింది పోయి ధనాశ తో అక్రమ నిర్మాణాలు చేపడుతూ అక్రమ సంపాదన కై ఆరాట పడుతున్నా తీరు అతని స్థాయి ని దిగజారుడు ధోరణికి నిదర్శనం అన్న భావన స్థానికుల్లో వ్యక్తం అవుతుంది
విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన విద్యాసంస్థల యాజమాన్యాలే అక్రమాలకు తెగ పడతన్నారు.అని బహిరంగ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.లక్షలాదిరూపాయల ఫీజులు వసూలు చేసి తమ ఖజానా నింపుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి కోట్లల్లో ఎగనామం పెడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు
తన చెరిస్మా తో ప్రభుత్వాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని క్షేత్ర స్థాయి అధికారులను సైతం అటు వైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు ఓ ప్రిన్సిపల్ సెక్రటరీ గట్టిగా ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.దీంతో డిప్యూటీ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల వైపు వెళ్లేందుకు సాహసించడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం నిర్వహించే పాఠశాల "ది శ్రీ రామ్ అకాడమీ"కి ఫైర్ సేఫ్టీ,విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్నప్పటికీ అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే వందలాది విద్యార్థుల ప్రాణాల పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు ఈ మధ్యకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగి పది బహుళంతస్థులు అగ్నికి ఆహుతై కొంతమంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం దీనికి కారణంగా వెప్పుకొచ్చారు.కనీస అనుమతులు లేకపోయిన అధికారులు కళ్ల ముందే జరుగుతున్న సదరు విద్యాసంస్థ పై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు ది శ్రీ రామ్ అకాడమీ ప్రస్తుత నిర్మాణం కొనసాగిస్తున్న ప్రదేశం 30 వేల చదరపు గజాల్లో చెరువు లో ఉంది.నాలాలు మింగి నిర్మాణం సాగుతుందని అటు ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సైతం తెలిసిన బడబాబులతో తమకెందుకులే అని సర్దుపోతూన్నట్టు స్థానికంగా పెద్ద చర్చ జరుగుతోంది
100 గజాల జాగాలో టిల్ ప్లస్ టు అనుమతులు తీసుకుని అదనంగా పెంట్ హౌజ్ వేసుకున్న సామాన్యుడు ఎటువంటి పిర్యాదు లేనప్పటికీ మునిసిపల్ అధికారులు ఆ పెంట్ హౌజ్ ను పూర్తి స్థాయి పోలీస్ ప్రొటక్షన్ తో కూల్చివేశదాక నిద్రపోని జి హెచ్ ఎం సి అధికారులు జీరో అనుమతులతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయలను కొల్లగొడుతూ ఎటువంటి అనుమతులు లేని విద్యాసంస్థల్ని ఎందుకు కూల్చడం లేదని స్థానికులు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు అంటే పెద్దలకు ఒక న్యాయం పేదలకు మరో న్యాయమా అని వారు పెదవి విరుస్తున్నారు

### చర్యలు తీసుకుంటాం ఎం ప్రసీద

**డిడి9 వార్త లో ప్రచురితమైన "ది శ్రీ రామ్ అకాడమీ అరాచకం"పై సర్కిల్ ఏసీపీ ఎం ప్రసీదను డిడి9 వార్త ప్రతినిధి వివరణ కోరగా ఆమె స్పందించారు.గతంలో నోటీస్ లు జారీ చేసి ఉంటే ఆ నోటీసులను పరిగణనలోకి తీసుకుని తదుపరి నోటీస్ లు తో పాటు స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసి కూల్చివేతలు చేపడతానని తెలిపారు.**





This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502520.